# శ్రీ రాంచంద్రజీ మహారాజ్
# బాబూజీ గారి

# అమృత వాక్యాలు


సేకరణ: **శ్రీ ఉదయ్ బేడేకర్,**

ప్రిసెప్టర్

హైదరాబాదు

తెలుగు అనువాదము:

టి.వి. శ్రీనివాసరావు, అధ్యాపకులు

ప్రిసెప్టరు, కడప.



**శ్రీ రాంచంద్ర మిషన్,**

బరకత్‌పుర హైదరాబాదు.

# అనువాదకుని వినతి.

ప్రిసెప్టరు శ్రీ బేడేకర్ గారు సేకరించిన బాబూజీ గారి అమూల్యమైన వాక్యాలను వారు హైదరాబాదులోని పద్మారావునగర్ సెంటరునందు సత్సంఘంలో సోదర సోదరీ మణులకు చదివి వినిపిస్తూ ఉండేవారు. అవి ఇంగ్లీషు భాషలో ఉన్నందున తెలుగులోకి అనువదించితే ఇంగ్లీషుభాష తెలియని పలువురి అభ్యాసీలకు ఇంకా ఉపయోగకరంగా ఉండగలందులకు తెలుగులోకి అనువదించమని అక్కడి సోదర సోదరీమణులు కోరినందున, "బాబూజీగారి అమృతవాక్కులు" అనే పేరుతో అనువదించడము జరిగింది. ఆవిధంగా కొంత సేవా భాగ్యం నాకు కలుగజేసారని నా విశ్వాసము.

బాబూజీగారి సందేశాలలోగాని, గ్రంథాలలోగాని ప్రతి వాక్యము ఒక మహావాక్యము. కేవలం మనతెలివిని ఆధారంచేసుకొని చదవడంకోసరమే చదివి అవగాహన చేసుకోవాలంటే, అది అసంపూర్ణంగానే ఉంటుంది. సదవగాహన కొరకు అయన్ను ఒక ఐదు లేక పదినిమిషాలు స్మరించి చదవడము ప్రారంభము చేస్తే, ఆయనతో మనకు అనుసంధాన మేర్పడి, ఆయన శక్తి ప్రసారితము (ప్రాణాహుతి) వల్ల సూక్ష్మమైన విషయాలు కూడా మన అవగాహనకు వస్తుంది. అంతేగాక, మనం చదివేప్పుడుగాని, లేదా మనం వినేప్పుడుగాని, బాబూజీగారే మనకు నేరుగా మన సమక్షంలో చెబుతున్నారనే భావనాస్థితిలో ఉండి, కొంచెముసేపు చదివినా లేక విన్నా శాశ్వతమైన సత్ఫలితాలను పొందగలమని నా విశ్వాసము.

చదివిన తర్వాత దానిని నిత్యజీవితంలో అనుక్షణం ఏవిధంగా ఆచరించవలెననేది అన్నింటికన్న ముఖ్యవిషయమని వేరుగా చెప్పనక్కరలేదు. గనుక, తొందరపడకుండా, చదివేది మనఃస్ఫూర్తిగా చదవాలి. ఇప్పుడు అవగతమైనది కొద్ది కాలం తర్వాత మరల మరల చదివినా, స్ఫురణకు తెచ్చుకొన్నా, ఎప్పటికప్పుడు నూతనమైన, సూక్ష్మమైన ఉన్నతమైన భావాలు మన పురోగతి ననుసరించి బాబూజీగారి దయవలన అవగతమవుతూ ఉంటాయి.

నేను అనువదించిన ఈ వాక్యములలో, భాషా పరమైన దర్పమునకు ప్రాధాన్యత యివ్వలేదు. సాధ్యమయినంత వరకు భావమునకే ప్రాముఖ్యతను ఇచ్చాను. చదువరులు మన్నింతురు గాక.

ఇందులోని విషయములను గురించి సందర్భానుసారంగా ఏదైనా భావనా పరంగా నేను వ్యక్తము చేయడంలో ఏ మాత్రము అనుమానము గాని సందిగ్ధత గాని కలిగిన, మూలము ప్రమాణమే కాని అనువాద విషయములు కావని మనవి.

12-4-2005

శ్రీ రాంచంద్రజీ మహరాజ్ సేవా ట్రస్టు
రాధాకృష్ణ నగర్, కో-ఆపరేటివ్ కాలని
కడప.

**టి.వి. శ్రీనివాసరావు**
అడ్వొకేటు, ప్రిసెప్టరు
6-5, రామారావు వీధి,
కడప

# శ్రీ రాంచంద్రజీ మహారాజ్ గారి (బాబూజీ), షాజహాన్‌పూర్

## అద్భుత వాక్కులు

సేకరణ శ్రీ ఉదయ్ వేదేకర్, హైదరాబాదు     తెలుగు అనువాదము: టి.వి.శ్రీనివాసరావు, కడప.

1. ఆదర్శప్రాయంగా ఉండునట్టి వాడే గురువు. అట్టి ఆదర్శాన్ని బలపరచు వాడే గురువుయొక్క సహచరుడు.

2. ఎవరికి అర్హత ఉన్నదో అట్టి వాడే ఫలితాన్ని పొందుతాడు. అనుచరుడు ఎప్పుడు సత్ప్రవర్తన, మంచి స్వభావము, నిష్పక్షమైన వైఖరి, అర్హత కలిగి ఉండాలి.

3. శిష్యునియొక్క శక్తి సామర్థ్యములే గురువును ఆకర్షించేది. అనేక స్థితులు దాటిన పిమ్మట ఇట్టి సామర్థ్యము కలుగుతుంది.

4. గురువుగారిని అనంతంగా శిష్యుడు ఎట్లు ప్రేమించగలడు? గురువుగారి మీద ధ్యానం ద్వారానే. గురువు గారి రూపంమీద ధ్యానమనేది అపారమైన ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, అట్టి గురువు మూలమందు లయించినట్టి వాడై ఉండాలి.

5. ప్రేమ అనేది రెండు విధాలు. భగవంతుడిని నేరుగా ప్రేమించడము, రెండవది మరొకని ద్వారా ప్రేమించడము. మరొకని ద్వారా ప్రేమించడమువల్లనే ప్రయోజనం పొందడము జరుగుతుంది.

6. నిజమైన ప్రేమ అంటే, తాను గురువు గారిని ప్రేమిస్తున్నాననిగాని, లేదా గురువుగారు తనను ప్రేమిస్తున్నాడని గాని తెలియకుండా ఉండడమే.

7. గర్వము, ఆడంబరము, ఆహ్లాదాలకు కారణముల్లైన సినిమాలు, నృత్యములు మొదలయిన వాటినుండి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి.

8. ఇంద్రియాలకు సంబంధించిన వాంఛలన్ని నాభి ప్రాంతంలో నిల్వ చేయబడి ఉంటాయి. దాని శక్తి బహిర్ముఖం కాకుండా ఉండగలందులకు మన సంస్థలో ఈ స్థానానికి ప్రాముఖ్యత నివ్వము.

9. కామ మనేదాన్ని ఏదోవిధంగా నిర్మూలిస్తే తెలివి సంపూర్ణంగా అంతరించి పోతుంది. ఇది బుద్ధియొక్క కేంద్రముతో సన్నిహితంగా కలిసి ఉంటుంది. కేంద్రాన్ని నిర్మూలిస్తే, మానవుడు అటు దైవముఖంగానూ పురోగమించలేడు, ఇటు ప్రాపంచికంగానూ పురోగమించలేడు. వాస్తవంలో క్రోధమనేది, ఆత్మస్వరూపుల్లైన మానవులను కార్యోన్ముఖులుగా చేయడానికి అవసరమైన ప్రోత్సాహాన్ని కలుగజేసేది ఇదే.

10. కోపమనేది తప్పుకాదు కాని, దాన్ని సరియైన రీతిలో ఉపయోగ పెట్టుకోవాలి. నీకు కోపం వచ్చినప్పుడు ఆకాశంవైపు చూడు.

11. నీవు కోపంతో ఉండేప్పుడు నిరాశ, నిస్పృహలను ఎప్పుడేగాని నీహృదయంలోకి రానివ్వవద్దు. మెదడు నిర్వీర్యంగా ఉన్నప్పుడు నిస్పృహ ఏర్పడుతుంది. అట్టి సమయంలో పాలు తాగడము ఎంతో మేలు చేస్తుంది.

12. గురువును గురించిన ఒక్క ఆలోచనను మాత్రం తీసుకొని దాన్ని పటిష్టంచేయాలి. పనికిమాలిన సంభాషణలు మానేయాలి. మూర్ఖమైన చర్చలకు దూరంగా ఉండాలి. నవలలు చదవడము మానేయాలి. హృదయాన్ని చిల్లర విషయాలపై మక్కువతో కలుషితం చేయకూడదు.

13. ఆధ్యాత్మికతకు శాంతి, వినయ విధేయత, మర్యాదలు మాత్రమే కావలసినవి. హృదయం చాలా సున్నిత మైంది. ఏకొంచెము గాలివీచినా, అది తల్లడిల్లి దుర్బలమవుతుంది.

14. ఎవరైతే స్వతఃసిద్ధంగా శాంత స్వభావంతో ఉంటారో అట్టివారికే శక్తి సామర్థ్యాలు ప్రసాదింపబడుతాయి.

15. మన ఋషులు ప్రతి మంత్రము శాంతి కొరకే జపించారు. ఎందుచేత? అదే సత్యం గనుక. అలజడి, ఉష్ణములనేవి మాయా పరిమితులలో ఉంటాయి.

16. ఇతరులయందు దోషాలను చూచే స్వభావం ఉన్నదంటే, అట్టి దోషము తనయందే బీజరూపంలో ఉన్నదనేది సూచిస్తుంది. ఇతరులలోని దోషాలపై దృష్టి సారించి ప్రతిఫలింపచేస్తే, ఇతరులలోని అట్టి దోషాలు తన మనసులోకి ప్రవేశిస్తాయి.

17. ఇతరులను తప్పు పట్టడమనేది ఒక లోపం. దానివల్ల దు:ఖాల పాలవుతాడు. ఈ అలవాటు మానుకోవాలి. ఎందు చేతనంటే, ఏదైనా అలవాటుగా మారితే అదే దోషంగా పరిణమిస్తుంది.

18. ఆలోచనలలో ఏదైనా దోషాలు కనబడితే వాటిని గురువుగారి ముందు ఉంచి వాటినుండి విముక్తి పొందడానికి ప్రార్థన చేయండి.

19. ఆలోచనకు దృఢమైన శక్తి అపరిమితంగా ఉంది. ఒక చిన్న ఆలోచన ఏర్పడినప్పటికి, విపత్కర పరి స్థితులకు దారితీయ వచ్చు. మనసులో ఒక చెడు ఆలోచన ఉన్నట్లుండి

కలిగితే, వెంటనే ఒక మంచి ఆలోచనతో మనసునను సమత్వానికి తీసుకొనిరావచ్చు.

20. మనసులోని మాలిన్యాన్ని పారద్రోలితే పవిత్రమైన స్థితి కలుగుతుంది. అప్పుడు పశు లక్షణం అంతమవుతుంది.

21. ఇతరులతో మట్లాడేప్పుడు వినయము, విధేయ తలతో, ఆకర్షించేట్లుగా ఉండాలి. అనవసరమైన వాద ప్రతి వాదనలతో పనికిమాలిన విమర్శనలతో కాలయాపన చేయకూడదు. సంధర్భోచితమైన ప్రశ్నలు మాత్రమే అడగవలెగాని, అనవసరంగా అడుగరాదు.

22. తన సంస్థ యొక్క గురు శిష్యులకు, యితర సంస్థల యొక్క గురు శిష్యులకు మధ్య బేధాలు ఉండరాదు.

23. బలహీనతకు మరో పేరు హృదయ దౌర్బల్యము. ఈ బలహీనత ఎవనికి ఉంటుందో, వాడు హృదయ ప్రాంతాన్ని వదలినాడని అర్థం. ఇక అతనికి పురోగతి పూర్తిగా స్థంభించి పోయినట్లే.

24. ధ్యానమంటే దైవము వైపు గమనికతో ఉండడము. చైతన్యవంతంగా దృష్టి అక్కడ ఉండవలెనే గాని, అపరోక్షంగా

గమనించడము కాదు. ధ్యానమందు బుద్ధిపూర్వకమైన కృషి అవసరము.

25. ధ్యానం చేస్తున్నప్పుడు, ఒక విధమైన శూన్యత ఏర్పడి, అందులోకి దివ్యత్వమనేది, నీ ఆహ్వానం లేకుండానే అప్రయత్నంగా ప్రవేశిస్తుంది. అయినప్పటికి ఏదో ఒకటి నీవు పొందుతావు. ఈ ఏదో ఒకటి అనేది ఏదయినప్పటికి అది పొందదగినది.

26. హృదయంలోనుండి రూపము అంతర్ధానం కావడము మొదలయితే అశాంతి ఏర్పడుతుంది. అట్టి స్థితిలో నీ బంధము నేరుగా ఉంటుంది.

27. ప్రతి స్థాయికి, దాని తదుపరి స్థాయికి మధ్యన, తటస్థంగా ఒక స్థాయి ఉండడము వల్ల, ఎప్పుడైతే ఒక స్థితినుండి మరొక స్థితికి పురోభివృద్ధి చెందినప్పుడు, ఒకవిధమైన స్తబ్ధత ఏర్పడినట్లు అనిపిస్తుంది.

28. వాస్తవిక స్థితి పొందడము మొదలయిన తర్వాత ప్రజలు సాధనను వదిలేస్తారు. ఇది దురదృష్టకరమైన విషయము.

29. దైవానుగ్రహమును గురించి మనమెప్పుడేగాని నిరాశ, నిస్పృహ చెందకూడదు. గురువుగారికి అంతా వదిలెయ్యి.

నిజమైన అన్వేషకునికి ఏది సంప్రాప్తమైనా, అది అతని మార్గమందు పురోభివృద్ధి కొరకే జరుగుతుంది

30. నీకంటే ఒకడు చిన్నవాడు, మరొకడు పెద్దవాడనే తలంపు వదిలెయ్యి. ఆధ్యాత్మిక మార్గంలో వయసుంతో నిమిత్తం లేదు. చిన్నవాడు చాలపెద్దవాడు కావచ్చు. కాని ప్రాపంచికంగా మర్యాద మాత్రం పాటించాలి.

31. దూషణలకు క్రుంగి పోకుండా, భూషణలకు పొంగిపోకుండా ఉండేందుకు సాధన అలవాటు చేసుకో. అయితే యితరుల మనోభావాలను కించపరచే విధంగా నీవు మాట్లాడ కూడదు.

32. శత్రువులను, మిత్రులను ఇరువురిపట్ల సమ భావనతో చూడు. మాటలతో నిన్ను దూషించినప్పటికి ఏమి బాధ పడవద్దు. అన్ని సందర్భాలలో గురువుగారు నీతో ఉంటారు.

33. స్నేహం చేయాలనేది ఒక వ్యసనము కాకూడదు. స్వార్థ రహితమైన స్నేహితులు ఈ ప్రపంచంలో చాలా అరుదు. అభ్యాసికి గురువుతప్ప వేరే మిత్రుడు మరొకడు లేడు.

34. నిస్వార్థ లక్షణము లేని వానిని గురువని పిలువ బడుటకుకూడా అర్హత ఉండదు.

35. ఈ ప్రపంచంలో ఆయన్ను స్వీకరించిన ప్రతివాడు ఆయనచే స్వీకరింప బడినవాడే. కేవలము తీవ్ర జిజ్ఞాస తప్ప ఏవిధమైన పక్షపాతము గాని, వ్యక్తుల స్థాయీభేధాలుగాని ఉండవు. జిజ్ఞాస ఎంత తీవ్రంగా ఉంటే అంతగా సహాయము అందజేయబడుతుంది.

36. తనవద్ద ఉన్నదంతా ఇచ్చివేసినప్పుడు, ఆ ఇచ్చినది ఎవరి స్వాధీనంలో ఉంటుందో, అదంతా ఇచ్చిన వానిలో లయించి పోతుంది. ఎంతవరకు అభ్యాసి గురువుగారికి ఇవ్వడములో వెనుకంజ వేస్తాడో, అదే ప్రకారం ఆయననుండి తాను కూడా అదే మోతాదులో పొందుతూ ఉంటాడు.

37. సంపద పొందినప్పుడు అధ్యాత్మికతవైపు దృష్టి మరలదు. ప్రాపంచికమైన దృష్టి అంతమొందక పోతే ఆధ్యాత్మిక రంగంలో మునక వేయలేదు. అందువలననే భగవంతుడిని అన్వేషించేవారు ఎప్పుడూ అవస్థ పడుతూనే ఉంటారు.

38. ధ్యాన సమయంలో ఆలోచనలు, పిల్లవాండ్లు రోడ్డుమీద ఆటలాడుతున్నట్లుగా ఉంటుంది. నీ దృష్టి ఆలోచనల వైపు లేనప్పుడు, అవి నిష్ప్రయోజనములు, నిరర్థకము. ఆలోచనలు నిన్ను కలత పెట్టవు కాని, నీవు కలత చెందినట్లు భావిస్తావు. ఆలోచనలు వాటి స్థానాన్ని విడిచిపెట్టి, దివ్యత్వం రాక కొరకు ఎదురు చూస్తూ ఉంటాయి.

39. రాజయోగ ప్రభావమనే పుస్తకములో 'బి' అనే స్థానం సంస్కారాలకు నివాస స్థళం. ఎప్పుడయితే ధ్యానంయొక్క శక్తి ప్రవాహానికి, హృదయమందలి తెరను ఛేదిస్తుందో, అక్కడ కొంచెము శూన్యము ఉండడమువల్ల, ఆలోచనలను ఆకర్షిస్తుంది. ఈ విధంగా ఆలోచనలు పైకి లేచినప్పుడు నీవు కలత చెందినట్లు అనిపిస్తుంది. అందుచేత, ఆలోచనలు నీతో తలదూర్చవు కాని, నీవే వాటితో తల దూరుస్తావు.

40. అనేక విషయాలపై ఉండే ఆలోచనలను ఒకే వైపు మళ్ళించి, సమస్త శక్తిని ఒక్కవైపు నుండి వాటిలోకి ప్రవహించునట్లు చేయడమే అభ్యాసము యొక్క ముఖ్య ఉద్దేశము.

41. శిష్యునికి గురువు యొక్క తలంపు అత్యంతా వశ్యకమైన ముఖ్య విషయము. ఆయన తప్ప ఇతర ఏ ఆలోచన కూడా సబబుకాదు. శిష్యునికి తన గురువును మించిన సంపద లేదు.

42. మనం గురువు కోసం వేటాడ కూడదు. అయితే ఒక గురువుయందు మాత్రమే విశ్వాసం ఉంచాలి. అన్ని తలంపులు అట్టి ఏకైక గురువును గురించే ఉండాలి. ఆయనలో లయించడానికి ప్రయత్నం చేయాలి. దైవీక శక్తి గురువు ద్వారానే ప్రవహించడానికి సాధ్యపడుతుంది.

43. 'త్రిగుణాత్మక' మనే దాన్ని గురించిన ఆలోచన నీమనసులో ఎందుకు? లక్ష్యమందు నీ దృష్టిని స్థిరంచెయ్యి. ప్రేమ అనేది ఒకదానియందే ఉండగలదు. ఒకదానికంటే ఎక్కువ వాటి యందు హృదయాన్ని అర్పించడమనేది ప్రేమకు లక్షణం కాదు.

44. పిల్లవాండ్లను జాగ్రత్తగా పోషించి పైకి తీసుకొని రావాలి. అయితే వారియందు గల ప్రేమ హృదయంపై భారం కలుగ చేయకూడదు.

45. తన భార్యను తనకు సహాయకురాలిగా చేసుకొని గృహమనే రెండు చక్రాల బండికి తనుకూడా ఒక చక్రమనే భావనతో ఉండాలి.

46. స్నేహితులు, ఇరుగు పొరుగు వారు తనను వారి స్వంత మనిషిగా చూచుకొనునట్లు, తన ప్రవర్తన వారి పట్ల అవిధంగా ఉండాలి.

47. హృదయంతర్గతంలో బంధ రహితంగా ఉంటూ, బంధువు లందరితోనూ సంబంధము కలిగి ఉండాలి. వారి సుఖ దుఃఖాలయందు భాగస్వామిగా ఉండాలి.

48. ఉన్నతాధికారులపట్ల నీ ప్రవర్తన అమర్యాదకరంగా ఉన్నదనే భావన వారికి రానీయకుండా నడుచుకోవాలి.

49. సోదర సత్సంఘులతో ఆప్యాయతను పెంపు చేసుకొంటూ, వారిపట్ల నీ ప్రవర్తన, మాటలు సుందరంగానూ, మధురంగానూ ఉండేట్లు దినదినము అభివృద్ధి చేసుకో.

50. ప్రత్యేకించి ఒకే విషయంగా ఉత్సాహం చూపించడము ఆధ్యాత్మికంగా శ్రేయస్కరం కాదు. తన ఆలోచనల ప్రభావం తనపై ఎంతమేరకు కలిగిస్తుందో, అంత మేరకు శక్తి అందులోకి ప్రవేశిస్తుంది.

51. మర్యాద చూపడము ప్రతిచోటా తప్పనిసరి. భగవదిచ్ఛకు లోబడి ఉండడమనేది భక్తికి పునాది. తాను భక్తుడనిన్ని, ఆయన ఆరాధింపబడేవాడనే భావన ఉండాలి.

52. తనకు కావలసిన పని చేయించుకొని, యితరులకు ఉపయోగ పడులాగున తానుకూడా యితరులను తయారు చేయనట్టి వానిని 'స్వార్థపరుడని' నేను అంటాను.

53. ప్రేమ ద్వారా సమస్తము పొందనగును. ధ్యానము తదితర సాధనా పద్ధతులు దీనితో పోల్చినప్పుడు ఇవి చాలా స్వల్పవిషయాలు.

54. విశ్వాసమనేది, ఆకులు, కొమ్మలు లేని వృక్షము వంటిది. సంపూర్ణ విశ్వాస మున్నప్పుడు, యిక చేయవలసిన దేమియు లేదు. అది పూర్తిగా ఏర్పడేవరకు ప్రతివానిలో ఏదో కొంత కొరత ఉంటుంది.

55. ఆధ్యాత్మికరంగంలోకి పూర్తి విశ్వాసంతో ప్రవేశించి, నేను, నాది అనేవాటిని పారద్రోలి సాధన చేయడానికి తయారుగా ఉండు.

56. దేనికైనా సరే మనసునను సిద్ధంచేసి, పటిష్ఠమైన ఇచ్ఛాశక్తితో కాలు మోపితే నీకు విజయము తప్పక చేకూరుతుంది.

57. నీ గురువును గౌరవించడము నేర్చుకో. ప్రేమికుడు తన ప్రేయసినితప్ప ఇక దేనిని చూడడు. ఇదే అతని సర్వస్వముగా భావిస్తాడు.

58. గురువుగారి యొక్క శక్తి సామర్థ్యాలను గురించిన భావన, ప్రజలు చేయలేనంత నిరాడంబరతయందు దాగి యున్నాడు. ఆయన సహచర్యంలో ఫలితాలను పొందిన వారు ధన్యులు. కొన్ని యుగాల తర్వాతకూడా ఇట్టి అవ్పదం చిక్కదు. అంతేగాక, ఇట్టి విశిష్ఠ వ్యక్తి మరల కానరాడు.

59. సోమరితనమైన అలవాట్లను వదలిపెట్టు. సోమరి తనంగా ఉండడమంటే చెత్తకుండీలో ఉండే చెత్తమోస్తరే. ఎవరైతే నిరర్థకమైన చర్చలతో కాలం వృథా చేస్తారో వారు తర్వాత పశ్చాత్తాపం పొందుతారు.

60. చంచల స్వభావం మార్గమందు విజయానికి అవరోధము. పాత అలవాట్లు అంతరించి పోవాలి. విజయం త్వరిత గతిన చేకూరడానికి కావలసిన పరిస్థితులను కలుగజేసుకో.

61. ఏవిధమైన మచ్చలేకుండా ఈ ప్రపంచంలో తప్పించుకోడము చాలా కష్టం. భావనలన్ని భగవంతునివైపు మళ్ళించినవాడే నిజమైన మానవుడు.

62. కష్టాలు, దుఃఖాలను వాటినుండి ఎవ్వరికేగాని స్వేచ్ఛ లేదు. సాధ్యమైనంతవరకు వాటిని గురించి చింతించ కూడదు. ఎవరికైనా విచారం కలిగినప్పుడు, గురువుగారిని తలచుకొని అవన్ని గురువుగారి ఇచ్ఛగా భావించి కృతజ్ఞత తెలుపుకోవాలి.

63. ప్రతి కష్టము భగవత్ప్రసాదంగా భావించి, అతని ఇచ్ఛకు విధేయుడుగా ఉండు. ప్రేయసినుండి వచ్చినది ఏదైనా సరే అసంతృప్తి చెందడమనేది ప్రేమ మార్గంలో మర్యాదకర లక్షణం కాదు.

64. మానవుడు అనుభవం పొందడానికే జన్మించాడు. బాధ అనేది సత్యాన్వేషణకు రహదారి. ప్రతి యోగికూడా నరకమనేదానిగుండా పోవాలి. యోగి అయినవాడు కూడా అన్ని బాధలకు గురి కావలసినదే.

65. ప్రపంచంలోని ఘర్షణలనుండి విడుదల కావడానికి, పవిత్రతో ఉండడానికి అరణ్యాలను ఆశ్రయిస్తారు. కాని వీటన్నింటిని సహించుతూ, గృహమందే నివశించు. ఇదే తపసును, ధ్యానము.

66. అన్ని పరిస్థితులలోను సంతోషంగా ఉండునట్లు నీ ప్రవర్తన అభివృద్ధి చేసుకో.

67. గడ్డిమోపంత తెలివికంటే గడ్డి పోచంత సాధన చాల శ్రేష్టము. నీకు ప్రపంచమంతా వ్యతిరేకమయినా, నీవారు నిన్ను విస్మరించినా, నీవు ఏమి తీర్మానించుకొన్నావో, దానిని కార్యరూపంలో అమలు చెయ్యి. ధృఢనిశ్చయంతో ఉండు. ఆకాశం విరిగి నీ నెత్తిన పడినా, సూర్యుడు విరుచుకుపడినా, నీవు చేపట్టిన మార్గమునకు భిన్నముగా పోవద్దు.

68. దివ్యానుగ్రహమును గురువుద్వారా తనవైపుకు మళ్ళించుకొని దానిని పొందడానికి తగిన అర్హత కలుగ జేసు కొనేందుకు చేయు అభ్యాసము ఒక సాధనమాత్రమే.

69. నీ ఇంటిలో నీవు ఒక అతిథిగా ఉండు. యోగికి బంధమనేది లేదు. ప్రకృతి ఆదేశము ఏది అయినప్పటికి అతను శిరసావహిస్తాడు.

70. గురువుయొక్క సహాయము చివరివరకు వదలకూడదు. గురువుపట్ల భక్తి శ్రద్ధలనేవి అన్ని దురవస్థలను ఖచ్చితంగా రూపు మపుతుంది.

71. సహఅభ్యాసిని తన సోదరుడుగా భావించి, అవిధంగా నడుచుకోవడము చాలా అవసరము. అతని సుఖ దుఃఖాలలో సాధ్యమయినంతవరకు సహాయము చేయడానికి ప్రయత్నం చేయాలి.

72. అసహ్యాకరమైన సంభాషణలు వినడము పాపము. వినకూడని అట్టి సంభాషణలు ఎక్కడైనా వినబడుతూ వుంటే అట్టి ప్రదేశాన్ని బహిష్కరించి వెళ్ళిపోవడం మంచిది.

73. దేవాలయాలలోని పూజలు, తీర్థయాత్రలు పరిసర వాతావరణంలో కొంత మార్పు కలుగజేయవచ్చు. యజ్ఞమనేది ధర్మార్థ కామ మోక్షములనేవాటిని యివ్వవచ్చు. కాని సద్గురువు ఒక్కడే సాక్షాత్కారాన్ని ప్రసాదించగలడు.

74. ప్రార్థన అంటే యాచించడము. ధ్యానమంటే పొందడము. నిజమయిన ప్రార్థనద్వారా భగవంతునితో నేరుగా బంధము కలుగజేసుకోవాలి.

75. ప్రార్థన అనేది మాలిన్యము లేని ఆలోచన. అది భక్తికి సూచన. అంతిమ స్థాయికి తీసుకొని పొమ్మని చేసేదే ప్రార్థన.

76. ప్రార్థన ఒకటి లేక రెండు సార్లు ఉచ్చరించు. తర్వాత జరగవలసిన పని భగవంతుడు చేయడానికి నిరీక్షిస్తూ ఉండు. భగవంతుని కొరకే నిరీక్షించడమనేది అవసరమే, లేదా నీవు భగవంతుని పట్ల భక్తి, శ్రద్ధ, ప్రేమలతో ఉన్నప్పటికి ఆయన నీకోసం నిరీక్షించేట్లుగా చేయి.

77. ఉత్తమమైన ప్రార్థన ఏది
భగవంతునికి అర్పణగావించుకొనే ఆలోచనయే.

78. ప్రపంచంలో ఏదేశమేగాని అధ్యాత్మికతయను బునాది లేనిదే నిలువ లేదు. ప్రతి దేశము నిదానంగానో, త్వరగానో తన ఉనికిని కాపాడుకోవాలంటే, అధ్యాత్మిక మార్గాన్ని అనుసరించ వలసినదే.

79. ఆకాశము అవకాశాన్ని సృష్టించింది. భగవంతుడనేది ఆకాశము యొక్క పరిణామము. తదుపరి పరిణామములన్ని

కాలానికి సంభందించినవే. ఆకాశాన్ని ఎవరు సృష్టించారు? భగవంతుడు, ప్రపంచముల అవిర్భావంకొరకు ఏర్పడిన అవసరమే ఆకాశాన్ని సృష్టించింది. అది అనంతము. ఎల్లప్పుడూ అనంతంగానే ఉంటుంది.

80. మనిషి ఎల్లప్పుడు ఆలోచనలేని స్థితిలో ఉండలేడు. సంపూర్ణంగా ఆలోచనారహిత స్థితి ఏర్పడితే, శరీరము జీవం లేనిదైపోతుంది.

81. సాక్షాత్కారానికి మూడు అవరోధాలున్నాయి. అవి:

1. మనం ప్రయత్నం చేస్తాముకాని, ప్రారంభము చేయము
2. ఒకేసారి అనేకం ప్రయత్నంచేస్తాము
3. మనయందు మనకే విశ్వాసము లేకుండుట

82. మూడు ముఖ్యమైన విషయాలు:-

1. సరియైన చర్య
2. సరియైన సాధన
3. సరియైన గురువు

83. మూడు విషయాలు నీవిగా ఉండాలి.

1. నీ సంస్థ
2. నీ పద్ధతి.
3. నీ గురువు

84. శరణాగాతి అనేది మూడు అంశాలతో కూడుకొని ఉంది.

1. ఆత్మార్పణ గావించడము,
2. బాధ్యతలన్నింటిని అర్పణ గావించడము
3. ఫలితాలను అర్పణగావించడము.

85. సంశయమనేది చిత్శక్తికి విషంతో సమానం. నిరాశయనేది మనసునకు విషంతో సమానం. సోమరితం జడత్వాన్ని కలుగజేస్తుంది. తాతాసరం పురోభివృద్ధికి విషంతో సమానం గనుక, దాన్ని ఎట్టి పరిస్థితులలోను విస్మరించాలి.

86. సంశయమునుండి విడివడడము ఏమి కష్టంకాదు. నిశ్చయానికి వస్తే సంశయాలన్ని విడిపోతాయి. సరియైన గట్టి బునాది లేని అలవాటుని సులభంగా కదలించివేయవచ్చు.

87. మనిషి ఈ విశ్వానికంతా సంక్షిప్తంగా ఉండే చిహ్నము. అతను ఎక్కడినుండి ఉత్పన్నమైనాడో, అట్టి మూలముతో ఐక్యమవడానికే నిర్దేశింపబడినాడు. అతనిలో ఏదికూడా చెడుగాని, పొరబాటుగాని మొదట్లో లేదు. ఎందుచేతనంటే, సృష్టికర్తయైన భగవంతుడు ఏ కొరతగాని, పొరబాటుగాని మానవునిలో లేకుండా సృష్టించాడు.

88. మానవుడు ఎల్లప్పుడు భయంతో ఉంటాడని ఆరోపింపబడిన గొప్ప లక్షణము. భగవంతుడు ఎల్లప్పుడు భయం లేనివాడని ఆరోపింపబడిన గొప్ప లక్షణము. భగవంతుడు నిర్భయత్వమనేది ప్రసాదిస్తాడు గనుక. అట్టి శక్తికి అర్పణ గావించుకో.

89. ఏవిధమైన మాలిన్యాలు లేని హృదయమందు భగవంతుని యొక్క శోభ అద్దములో వలె ప్రతిఫలిస్తుంది.

90. మనసుయొక్క సంకల్పమే మనము. జన్మ కలగడానికి ఈ సంకల్పబలమే కారణమయి, జన్మనెత్తవలెననేది నైజముగా మారుతుంది.

91. మనవుని సహజలక్షణము దివ్యత్వమే. ఈ లక్షణాన్ని తిరిగి పొందడమే మానవుని అంతిమ లక్ష్యము. ఆ అంతిమ లక్ష్యమును నేరుగా పొందడానికి మనం మార్గాన్ని కన్గొనాలి.

92. మానవ జీవితము చాలా ముఖ్యమైనది. దాన్ని కాపాడుకోవాలి. భగవంతునిచే సృష్టించబడిన దానిని మనం నాశనం చేయకూడదు. ఈప్రపంచమంతా ఆయన అనుగ్రహాన్ని పొందడములో భాగస్వామిగా చెయ్యి. అందరి క్షేమం కోరేవాడే నిజమైన మానవుడు.

93. మనం, భగవంతుడిని పొందడము చాలా సులభమైనప్పటికి, అవిధంగా కేవలము అశిస్తాము గాని పొందడానికి సుముఖత చూపించము.

94. శరీరములో ఎక్కడైన విషపదార్థమున్నప్పుడు జ్వరముగా బహిర్గతమవుతుంది. ఎందుచేతనంటే, మనలో నిజమైన శక్తి పని చేస్తున్నప్పుడు అనవసరమైనవాటిని బయటికి నెట్టి వేయబడుతాయి.

95. మనసుం ఒక మంచి పని చేస్తుంది. అది అపవిత్రమైన ఆలోచనలను బయటికి నెట్టి వేస్తూ ఉంటుంది. కాని, దైవీకమైన అలోచనలను బైటికి నెట్టివేయదు.

96 భగవంతునిసమక్షంలో మనల్ని బహిరంగ పరచుకోడమే బంధ విముక్తి.
తన్ను తాను బహిర్గతం చేసుకొన్నప్పుడు, సాక్షాత్కారమవుతుంది.
అభ్యాసం ద్వారా బంధవిముక్తి పొందవచ్చు.
సాక్షాత్కారమనేది ఇస్తే ఇవ్వవచ్చు, అది అయన ఇచ్ఛననుసరించి ఉంటుంది.

97. నీ నిజ స్థితిలో ఆయనముందు ఉండడమే బంధవిముక్తి. దీని వొత్తిడివల్ల తనకు తనే నీకు బహిర్గత మవుతాడు. దీనినే సాక్షాత్కారమంటారు.

98. స్వేచ్ఛనుండి స్వేచ్ఛయే బంధ విముక్తి. మరణమునుండి మరణమే సాక్షాత్కారం. భగవంతునియొక్క చేతనా స్థితియే జీవితము.

99. దేవుడు సర్వసమర్థుడు కాడు. ఆయనలాటి మరొక దేవుడిని ఆయన సృష్టించలేడు. ఆయన పొరబాటు చేయలేడు, అలాటప్పుడు ఆయన సర్వ సమర్థుడు ఏవిధంగా కాగలడు?

100. మన కర్మ వలన తయారు కాబడిన సంస్కారమనేది ఆలోచనయొక్క స్థూలరూపమే.

101. చెడువిషయాలను వదలిపెట్టు. అయితే నీవు చేసిన మంచి విషయాలను జ్ఞాపకం పెట్టుకో వద్దు.

102 భగవంతుని పట్ల నీవు అణుకువతో ఉండకపోతే, నీవనుకొన్నట్లు ఆయన నీ అవగాహనకు రాడు.

103. మనం ఏవిధంగా ఉండడము గురువుగారికి ఇష్టమో, ఆవిధంగా మనం తయారు కావాలి. ప్రకృతియొక్క కార్యమునకు ఎవరైతే అనర్హులో, వారు త్యజింపబడుతారు.

104. దైవీకము మనిషిని తయారు చేయదు. ఏవైనా అవరోధాలు, దోషాలు ఉంటే, వాటిని గురువుగారు తొలగించ గలరు. ఇవ్వవలసినది ఏదైతే ఉన్నదో, దాన్ని తప్పక భగవంతుడు ఇస్తాడు.

105. నీ ప్రయత్నంవల్ల అడుగు ముందుకు వేయలేక పోతే అది నీపొరబాటు కాదు. నీకు కావలసిన పద్ధతిలో కాకుండా ఆయన ఏదైతే ప్రసాదిస్తాడో అది నీవు అంగీకరించాలి.

106. గురువుగారిని గురించి మాట్లాడుకోవాలని కొన్నిమార్లు మనం అంటాము. అది మన లోపాన్ని సూచిస్తుంది. నీవు యింకా ఆయనలో లయించలేదు. ఆయనలో లీనమై అంతటా అట్టి వాతావరణాన్ని కలుగజెయ్యి.

107. మన కష్టాలు, బాధలు, గురుదేవులచే ప్రసాదింప బడిన బహుమతులుగా స్వీకరించడానికి తయారుగా ఉండాలి. ఈ జన్మలోనే కాకుండా అనేక జన్మలకు కూడా మనం గురువుగారికి చెందిన వారమే.

108. గురువుగారి ముందు వినయ విధేయతలతో కూర్చొని ఉన్నామని భావించు.

109. ప్రకృతి నియమాలు నిర్దిష్టమైనవి, నిర్ణయాత్మక మైనవి. వాటికి వ్యతిరేకముగా నడచుకోడము, ప్రకృతిని అగౌరవ పరచడమే.

110. గ్రహముల యొక్క ప్రభావమును, ధ్యాన సమయములో గురువుగారిని ప్రార్థించడము వలన తొలగించుకొన వచ్చును.

111. ధ్యానసమయంలో గురువే దివ్యత్వమని భావించు. చెడు ఆలోచనలను ఆయన ముందు ఉంచు.

112. నీవు గురువుగారి రూపంతో కప్పబడి ఉండు. జడత్వాన్ని తొలగించుకోడానికి, దానినుండి రక్షణ కొరకు గురువుగారిచే కప్పబడియున్నావని, దానిలో నీవు ఉన్నావని భావించు.

113. మనం కేవలము జరిగిపోయిన వాటికి వారసులమే కాకుండా జరగబోయే వాటికి కూడా పూర్వీకులమవుతాము. జరగ బోయే వాటిని గురించి ఆలోచించినందువల్ల వాసనాముద్రలకు లోతుగా తగుల్కొని పోతాము.

114. నీవు ఇతరులను గురించి కూడా గొప్పగా అనుకొన్నప్పుడు నిన్ను గురించి నీవు గొప్పగా అనుకోడములో తప్పు లేదు.

115. ఒక స్థితికి వచ్చినప్పుడు ఆలోచన వృద్ధి అయి దానికే అలవాటు పడతాడు.

116. అంతర్గతంగానూ. బహిర్గతంగానూ ఆయన ఉన్నాడనే శాశ్వతమైన తలంపే యోగము.

117. శీఘ్రగతిన ఆశ్చర్యకరమైన పురోభివృద్ధి నీకు కావాలంటే ధ్యానమందు గట్టి ఉత్సాహముండి, గురువుగారిని పిచ్చిగా ప్రేమించాలి. తిరుగులేని విధంగా కాయా, వాచా, మనసా ఆయనకు అర్పణ కావాలి.

118. నీవు ఏమి చేయలేకపోతే, గురువుగారే నిన్ను గురించిన ఆలోచనలో మునిగి ఉన్నాడని అనుకో.

119. పురోభివృద్ధి అంటే గురువుగారు నీ దగ్గర ఉన్నాడని భావించడమే.

120. ఆకాశంలో ప్రయాణం కేవలము ప్రాపంచికమే. శూన్యంలో ప్రయాణించడము ఆధ్యాత్మిక ప్రయాణము.

121. నిజమైన అభివృద్ధి అంటే మృత్యువనేదే కాని జన్మించడము కాదు.

122. భవన నిర్మాణానికి పనికివచ్చే రాయి వీధిలో పడిఉండడము ఎప్పుడూ నీకు కానరాదు.

123. ఆశ్చర్యమేమంటే, మనం సర్వము భగవంతుని నుండీ ఆశిస్తూఉంటాము, కాని దాన్ని పొందడానికి కనీసం అర్హత కొరకైనా ప్రయత్నం చేయము.

124. మరచిపోవడమే తెలుసుకోడము. అంతిమమైన దానిని తెలుసు కోవాలంటే మిగిలిన దానినంతా మరచి పోవాలి.

125. నీవు భగవంతుడిని జ్ఞాపకం ఉంచుకొని, గృహాన్ని మరచి పోతే అది మంచిది కాదు.

126. అంతర్ముఖంగా నిజాయితి అనేది దైవీకము. అట్టి దైవీకమును బహిర్గతంచేసినా, ప్రదర్శించినా దాని ఆకర్షణ కోల్పోతుంది.

127. గురువుగారి ముందు తలవంచకుండా నీవు వొంగినప్పుడు, అది నిజమైన వందనము.

128. ప్రేమతో వెక్కిళ్ళు వచ్చేట్లు రోదించు. నిజములో కన్నీరు రాలకపోయినా, కృత్రిమంగానైనా ఆ విధంగా చేసి దాని ఫలితాన్ని గమనించు.

129. భగవంతునివద్ద ఏమి ఉన్నదో అదే మనకు ఇచ్చాడు. మన కృషివల్ల మనం ఏమి సృష్టించుకొన్నామో వాటినే మనలో ఉంచుకొన్నాము. మన కృషివల్ల మనం సృష్టించుకొన్నవి ఏమిటనగా, మన ఆలోచనలతో ప్రపంచానికి ఎప్పుడూ దాసోహమై, చిక్కులు, సంస్కారాలు.

130. ధనమనేది మనకు అవసరమే కాని, ధనం కోసరము ఆకర్షణ, లోభిత్వము పనికిరాదు. లోభిత్వము మనము సృష్టించినది. అవసరమనేది భగవంతుని సృష్టి. నీచే సృష్టింపబడిన దానిని నీవు నిర్మూలించాలి.

131. యోగికి సత్ప్రవర్తన ముఖ్యము. అది పోగొట్టుకొంటే అతను గాడిద అవుతాడు కాని యోగి కాడు.

132. వార్తా పత్రికలు అధ్యయనం చేయనివారు, ప్రకృతిని అధ్యయనం చేసేవారు ధన్యులు.

133. శాంతి అనునది దైవము కాదు, కాని శాంతిరహితము అనేది దైవము. భావన అనేది భగవంతుని భాష.

భావనా రహితమే లయ. అనుగ్రహమనేది హృదయము యొక్క మాధుర్యము. నైపుణ్యాలను స్క్రమమైన రీతిలో వాడడము సాధు లక్షణము. స్వభావమనేది అన్నింటికి సంబంధము కలిగిన పర్యవసానము. వాస్తవికత అనేది వర్ణరహితత్వముయొక్క అస్పష్ట ప్రతి బింబమే.

134. మతముయొక్క అంతిమ స్థితియే ఆధ్యాత్మికతకు మొదలు. ఆధ్యాత్మికత అంతిమ స్థితియే సత్యమునకు మొదలు. సత్యముయొక్క అంతిమ స్థితియే నిజమైన శాంతి. అది కూడా అంతర్థానమైనప్పుడు మనం గమ్యాన్ని చేరుకొన్నట్లే.

135. తనగురువును తనే పొగడ కూడదు. అది ఆయన పట్ల అపచారము చేసినట్లవుతుంది.

136. ప్రసాదాన్ని భుజించునప్పుడు, శిరసునుండి కాలి బొటనవేలువరకు ఒక శక్తి ప్రవహిస్తుంది. అప్పుడు దాన్ని అంగీకరించినట్ల వుతుంది.

137. మన ప్రయత్నం ఎప్పుడే కాని వ్యర్థంకాకూడదు. వెంటవెంట బిందువులు రాలినప్పుడు దాని ఫలితము నదీ ప్రవాహమే. గనుక ఇతరవాటిని గురించిగాని, ఫలితాన్ని గురించిగాని లెక్కచేయకుండా మనపని మనం చేస్తూ ఉండాలి.

138. నా ఎదుట, త్రాసులో ఒక వైపు వజ్రాన్ని ఉంచి, మరొక వైపు ఒక నలుసు అధ్యాత్మికతను ఉంచితే, నేను వజ్రానికి బదులు అధ్యాత్మికతకే ప్రాముఖ్యత ఇస్తాను.

139. అవును, కాదు అను వాటికి మనం బద్ధులమై ఉన్నాము, కాని, ఏసందర్భాలలో ఈ రెండింటిని వాడాలనేది తెలియదు. అనుభవాన్ని బట్టి ఇది తెలుస్తుంది. ఏదైనా ఒక దానిని గురించి అవునని దూఢిగా ఆలోచించినప్పుడు, అది తెలియ చేయబడుతుంది. అదేవిధంగా కొన్ని విషయాలపట్ల కాదని అన్నప్పుడు, కాదనేదికూడా తెలియచేయబడుతుంది.

140. మనసులో మాట్లాడడము అనేది ఉంటుంది గనుక, మౌనమనేది లేదు. మౌనమనేది మానసిక స్థితి.

141. మౌనమనేది అధ్యాత్మికతలోని కొంత భాగమే గాని వాస్తవికత కాదు. మనం దానిని గురించి మాట్లాడాలనుకొన్నప్పుడు, అది భగవంతునికి సన్నిహితంగా ఉండేదని చెప్పవచ్చు. అంటే మౌనమనేదానికి మౌనమే ఆధారమని చెప్పవచ్చు.

142. అభ్యాసము ద్వారా మౌనమును గురించి అర్థము చేసుకోవచ్చు. ఒక ఆలోచన చేస్తే, దాన్ని గురించిన విషయాలు బహిర్గతమవుతూ ఉంటాయి. మన కంటికి సూక్ష్మక్రిములు కనబడకపోయినా, అవి ఉన్నాయి. గనుక మౌనమనేది ఉన్నప్పటికి

సంక్షిప్తంగా ఉన్నది. నిరంతర అభ్యాసంద్వారా కన్గొనవచ్చు.

143. మాటలాడేప్పుడు, చదివేప్పుడు చాలా ఎరుక గలిగి ఉండాలి. పైనుండి వచ్చు శృతిని అందుకోవాలంటే ఈ ఎరుక అవసరము. అయినా ఐదువేలమందిలో ఒక్కడు కూడా అట్టి ఎరుకతో ఉండరు. దాన్ని అలవాటు చేసుకొని, దానిపై ధ్యానంచేసి దానిలో ఏమున్నదో తెలుసుకోవాలి.

144 భగవంతుని ఏకత్వమునందు నమ్మకముంచి ఆయన్ను ఆవిధంగానే ఆరాధిస్తూ, విగ్రహారాధన, నిరర్థకమైన యితర ఆరాధనా పద్ధతులను మానుకోడానికి ప్రయత్నంచేయాలి.

145. భగవంతుడనే వానిని తనలో మాత్రమే కన్గొనగలడు. ఇతర మధ్యవర్తుల ద్వారా కన్గొనడానికి సాధ్యము కాదు.

146. పండితుడవై ఆతెలివితో నీకు నీవే చెడుపు కలుగ చేసుకో వద్దు. మతారాధకుడవై అంతటితో అందమొందవద్దు. వాటినుండి దూరంగా ఉండు. ఎల్లవేళలా సద్వస్తువుతో ఉండు, నీ సమస్య తీరిపోతుంది.

147. దైవంతో సంబంధం పెట్టుకొని ప్రతి పని చెయ్యి.

148. అన్ని కార్యములు భగవంతునియొక్క నిధి కొరకే చేయాలి. అప్పుడదే ఆరాధనగా రూపొందుతుంది.

149. దైవ దూషణకూడా నిరంతర స్మరణయే. దేవుడు నీ దూషణలకు చలిస్తే అతడు దేవుడు కాడు.

150. సాక్షాత్కారానికి మనసుం సాధనము. మెదడు మనసుంనకు స్థానము. మనసుం కనిపెడుతుంది. హృదయము పరిశీలిస్తుంది. మనసుం, హృదయములను ఈ రెండు ఆశ్చర్యకరములైన సాధనములు.

151. జీవితాంతము సంస్థపట్ల ఎల్లప్పుడు విశ్వాసముతో ఉండాలి. గురువుగారికి సంపూర్ణంగా విధేయుడవై ఉండాలి. సంస్థ యొక్క ఆశయాలకు, నియమాలకు బద్ధుడవై ఉండాలి.

152. ఆరిపోయిన జ్వాలలో తనకు తాను దహించి పోవడమనేది దాని సామర్థ్యము కాదు.

153. నా గురువుగారిని నేను ఇంతవరకు విడిచిపెట్టలేదు. ఇకమీదట కూడా విడిచిపెట్టాలనే తలంపు ఎప్పుడేగాని నాకు కలుగకుండా ఉండాలని నేను ప్రార్థిస్తున్నాను. గురువుగారి ఆదేశాలను పాటించడమనేది పూజకంటే శ్రేష్ఠతరమైనది.

**ఓం తత్ సత్.**